క్లుప్తంగా

పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి



పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు

పొదిలి: నగర పంచాయతీ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పి.శ్రీనివాసరావు పొదిలిలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించారు. పట్టణంలోని పలు రోడ్లలో చెత్తను తొలగించి, మురుగు కాలువలు శుభ్రం చేయిస్తున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. దోమలు వృద్ధి చెందకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారుతీరావు ఉన్నారు.


బాధ్యతలు స్వీకరించిన అర్ధవీడు ఎస్సై



సుదర్శన్‌యాదవ్

అర్ధవీడు (బేస్తవారిపేట): అర్ధవీడు మండల నూతన ఎస్సైగా బి.సుదర్శన్ యాదవ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదీల్లో భాగంగా ఆయన అర్ధవీడు ఎస్సైగా నియమితులయ్యారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని, గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

వినాయక ప్రతిమలు పంపిణీ



పంపిణీకి సిద్ధంగా ఉన్న విగ్రహాలు

మార్కాపురం: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని విఘ్నేశ్వర సేవా సంఘం ఆధ్వర్యంలో సుమారు 35 వినాయక విగ్రహాలను గురువారం ఉచితంగా పంపిణీ చేశారు. సేవా సంఘం వైస్ ప్రెసిడెంట్ దేవిశెట్టి రామ్మోహన్ మాట్లాడుతూ.. గత 22 ఏళ్లుగా విగ్రహాలు ఉచితంగా అందజేస్తున్నామన్నారు. గణేష్ నవరాత్రులను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సభ్యులు పి.మోహన్, పీవీ కృష్ణారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పథకాలను చెంచులు సద్వినియోగం చేసుకోవాలి



ఆధార్ కార్డులు పంపిణీ చేస్తున్న డీఎల్‌డీఓ, ఎంపీడీఓ

మార్కాపురం రూరల్: ప్రధానమంత్రి జన్‌మన్ ఐఈసీలో భాగంగా మార్కాపురం మండలం జమ్మనపల్లి ఎస్టీ కాలనీలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎల్‌డీఓ సాయికుమార్, ఎంపీడీఓ తోట చందన మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను గ్రామస్తులకు వివరించారు. చెంచు గిరిజనులు ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డీ రామ్మోహన్‌రెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

ఘనంగా గురుపూజోత్సవం

మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.



బేస్తవారిపేటలో విద్యార్థుల నుంచి సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు

పొదిలి రూరల్: పొదిలిలో ఉత్తమ ఉపాధ్యాయుల అభినందన సభలో ఎంఈఓ ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులను లక్ష్య సాధన దిశగా నడిపించే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. ఉత్తమ అవార్డులు పొందిన 11 మంది ఉపాధ్యాయులకు జ్ఞాపికలు అందజేసి సన్మానించారు. ఎంఈఓ-2 పి.నాగలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల: గొట్లగట్టు కేజీబీవీలో ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ, జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం విజయలక్ష్మి ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తమ గురువులను ఘనంగా సన్మానించారు. ఆటల, పాటల పోటీల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉత్తమ అవార్డు అందుకున్న సిద్ధవరం ఏఏ పాఠశాల టీచర్ కందుల సుజాతను యూటీఎఫ్ నాయకులు, తోటి ఉద్యోగులు అభినందించారు.

కోలాట గురువుకు సన్మానం

మార్కాపురం రూరల్: గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని మార్కాపురం మండలం రాయవరం గ్రామంలో అమలక లక్ష్మీనారాయణస్వామి కోలాట బృందం గురువైన మార్కాపురం వైఎస్సార్ సీపీ మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ గుంటక వనజాక్షిని బృంద సభ్యులు ఘనంగా సన్మానించారు. మార్కాపురం పట్టణంలో గత కొన్నేళ్లుగా పిల్లలకు భగవద్గీత నేర్పిస్తున్న జవ్వాజి అపర్ణ, అంగన్‌వాడీ టీచర్ భాగ్యలక్ష్మిని సన్మానించారు.

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్, బాలుర ఉన్నత పాఠశాల, కేజీబీవీ, ప్రైవేట్ పాఠశాలలు, అలాగే కంభంలోని ప్రైవేట్ కాలేజీల్లో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణలో తరగతులు నిర్వహించారు. గురువులను సన్మానించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవిత విశేషాలను విద్యార్థులకు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు కర్నాటి తిరుపతిరెడ్డి, ఎంఎస్ శర్మ, కేజీబీవీ ప్రిన్సిపాల్ , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తర్లుపాడు: మండలంలో గురుపూజోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తర్లుపాడులోని అంగన్‌వాడీ స్కూల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణవేణి ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు.

కొమరోలు: స్థానిక ఎమ్మార్సీలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఎంఈఓ వెంకటరత్నం నివాళులర్పించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కొమరోలులోని ఎస్‌బీఎస్‌ఆర్‌ఎం ఎయిడెడ్ పాఠశాలలో హెచ్‌ఎం బందుగుల సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ రేవతి తదితరులు సర్వేపల్లి సేవలను విద్యార్థులకువివరించారు. అనంతరం ఉపాధ్యాయులకు ఆటలపోటీలునిర్వహించిబహుమతులుఅందజేశారు.

ఉత్తమ గురువులకు సన్మానం

కంభం/కొమరోలు: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన కంభం ఉర్దూ పాఠశాల టీచర్ సయ్యద్ యాస్మిన్ భాను, కొమరోలు మండలంలోని అల్లినగరం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం దాసరి గురుస్వామి గురువారం ఒంగోలులో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ తమీమ్ అన్సారియా, డీఈఓ సుభద్ర చేతులమీదుగా అవార్డు అందుకున్నారు.



పొదిలిలో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసరెడ్డి



ఉత్తమ అవార్డు అందుకుంటున్న యాస్మిన్ భాను



దాసరి గురుమూర్తిని సన్మానిస్తున్న కలెక్టర్



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న కందుల సుజాత



గుంటక వనజాక్షిని సన్మానిస్తున్న కోలాట బృందం



తర్లుపాడు అంగన్‌వాడీ స్కూల్లో..



గొట్లగట్టు కస్తూర్బా గాంధీ పాఠశాలలో..

మా స్థలాల్లో మీ పెత్తనమేంటి?

- 99 ఏళ్లపాటు లీజుకు తీసుకున్నాం
- దేవదాయ శాఖ అధికారులకు అమ్మవారిపల్లి వాసుల స్పష్టీకరణ



గ్రామస్తులతో మాట్లాడుతున్న రూరల్ ఎస్సై అంకమరావు

మార్కాపురం రూరల్: మార్కాపురం మండలం అమ్మవారిపల్లిలో సద్గురు యోగానంద లక్ష్మీ నరసింహస్వామి ఆలయ భూములపై దేవదాయ శాఖ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వామివారు జీవ సమాధి కాక ముందు తమ పూర్వీకులకు ఒక్కొక్కరికి 2 సెంట్ల చొప్పున 99 ఏళ్లపాటు స్థలాన్ని లీజుకు కేటాయించినట్లు గ్రామస్తులు స్పష్టం చేశారు. అయితే ఆ స్థలం దేవదాయ శాఖకు చెందినదని అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసేందుకు రావడంతో గ్రామస్తులు అడ్డుకున్నారు. దేవదాయ శాఖాధికారుల ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై పి.అంకమరావు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్తులను సముదాయించారు. ఎట్టకేలకు దేవాదయశాఖ అధికారులు ఆ స్థలంలో గురువారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

పిల్లల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించాలి



పౌష్టికాహారం తయారు చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ లలితా సలోమీ

మార్కాపురం: పిల్లలు, బాలింతలు, గర్భిణుల్లో పౌష్టికాహార లోపం తలెత్తకుండా చూసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.రవికుమారి సూచించారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని 78, 79, 80 అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తల్లులు, పిల్లలు రోజూ పాలు, గడ్డు, ఆకుకూరలు తీసుకోవాలని చెప్పారు. పౌష్టికాహార పదార్థాల తయారీ విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్: మండలంలోని రాయవరం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార వారోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. సూపర్‌వైజర్ లలిత సలోమీ మాట్లాడుతూ.. పోషకాహారంతో కలిగే ప్రయోజనాలను, తయారీ విధానాన్ని వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్, గోవుల నియంత్రణకు చర్యలు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో ట్రాఫిక్, గోవుల సమస్యలను అరికట్టేందుకు చర్యలు చేపట్టినట్లు పట్టణ ఎస్సై సైదుబాబు గురువారం తెలిపారు. గత రెండు రోజులుగా గోవుల యజమానులకు కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు చెప్పారు. గోవులను రోడ్లపైకి వదిలితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా పాత బస్టాండ్, దోర్నాల సెంటర్, కంభం సెంటర్, నాయుడు బజారు, మెయిన్ బజార్లలో ఆవులు రోడ్లపైనే పడుకుంటూ ఒక్కోసారి ప్రజలు, వాహనదారులను పొడుస్తూ ఇబ్బంది పెడుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలోనే గోవుల యజమానులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న తోపుడు బండ్ల వ్యాపారులకు కూడా కౌన్సెలింగ్ ఇచ్చామని చెప్పారు.



వాహనదారులను హెచ్చరిస్తున్న ఎస్సై సైదుబాబు

రోడ్డు ప్రమాదాలపై చిరు వ్యాపారులకు అవగాహన

గిద్దలూరు రూరల్: తోపుడు బండ్ల వ్యాపారులు, వీధి వ్యాపారులు ఇష్టారీతిగా వ్యవహరించడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని గిద్దలూరు అర్బన్ సీఐ సురేష్ పేర్కొన్నారు. గిద్దలూరు పట్టణంలోని పెద్ద కూరగాయల మార్కెట్ వద్ద గురువారం కూరగాయల వ్యాపారులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో గిద్దలూరు నగర పంచాయతీ కమిషనర్ వెంకటదాస్, ఏఎస్సై జిలాని, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



గిద్దలూరులో కమిషనర్ దాస్‌తో కలిసి ట్రాఫిక్‌ను పర్యవేక్షిస్తున్న సీఐ సురేష్

వరద బాధితులకు సహాయం

బేస్తవారిపేట: విజయవాడలోని వరద బాధితుల కోసం నియోజకవర్గ దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సమకూర్చిన రూ.19 వేలను గురువారం ఒంగోలులో కలెక్టర్ తమీమ్ అన్సారియాకు రూ.19 వేలు అందజేశారు. దివ్యాంగులైన పోలూరి వెంకటస్వామి రూ.10 వేలు, తోట నర్సింహులు రూ.4 వేలు, రఘుదాసుబాబు రూ.3 వేలు, విజయ కుమారి రూ.2 వేలు, సిద్దయ్య రూ.వెయ్యి రూపాయలను అందజేశారు.



కలెక్టర్‌కు నగదు అందజేస్తున్న దివ్యాంగులు

గిద్దలూరు రూరల్: విజయవాడలో వరద ముంపు బాధితులకు గిద్దలూరు రెవెన్యూ కార్యాలయ సిబ్బంది 10 వేల లీటర్ల మంచినీటి బాటిళ్లను ప్రత్యేక వాహనంలో గురువారం పంపించారు. ఏర్పాట్లను తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.



గిద్దలూరు నుంచి నీళ్ల బాటిళ్ల వాహనాన్ని తరలిస్తున్న తహసీల్దార్

గుండ్లమోటుకు భారీగా వరదనీరు



గుండ్లమోటు ఆనకట్ట మీదుగా ప్రవహిస్తున్న వరద నీరు

గిద్దలూరు రూరల్: గిద్దలూరు మండలంలోని గుండ్లమోటు ప్రాజెక్టుకు వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. గత కొద్ది రోజులుగా నల్లమల అటవీ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు వాగులు పొంగి పొర్లుతున్నాయి. గుండ్లమోటు ప్రాజెక్టుకు వరద పోటెత్తుతుండటంతో డీప్ బోర్లు రీచార్జ్ అవుతాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేత్రదానంపై ప్రజలకు అవగాహన కల్పించాలి

బేస్తవారిపేట: నేత్రదానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని పీహెచ్‌సీ వైద్యాధికారులు పృథ్వీ రాజ్, కావ్య, వర్షిణి పేర్కొన్నారు. 39వ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా స్థానిక పీహెచ్‌సీలో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నేత్రదాన ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని కోరారు. పోగొట్టుకున్న కంటిచూపును చికిత్స చేయడం ద్వారా తిరిగి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో నేత్ర వైద్య నిపుణులు ఇమ్మడి వెంకటేశ్వర్లు, పీహెచ్‌సీ సీహెచ్ఓ హబీబ్‌ఖాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యాధికారులు

'హలో మాల చలో ఒంగోలు'ను విజయవంతం చేయాలి

కంభం: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునః పరిశీలించి, రద్దు చేయాలని కోరుతూ ఈనెల 22న నిర్వహించనున్న హలో మాల ఛలో ఒంగోలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దళిత సంఘాల ఐక్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చప్పిడి వెంగళరావు కోరారు. గురువారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగాన్ని నాశనం చేయడానికి మనువాదులు చేసిన కృషిలో భాగమే ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు అని మండిపడ్డారు. ఈ కుట్రలను ఉమ్మడిగా తిప్పికొట్టి రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు కల్వకూరి అబ్రహం, నాయకులు తూమాటి అచ్చయ్య, నూతలపాటి రాజు, రాజేంద్రరాజు, శ్రీనివాస్, చిన్న వెంకటేశ్వర్లు, వినోద్‌కుమార్, ప్రభాకర్, రంగయ్య, ఆనంద్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

శాంతి హాస్పిటల్ అధినేత డాక్టర్ జయానందప్రకాష్ మృతి



డాక్టర్ ప్రకాష్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న జంకె వెంకటరెడ్డి

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలో ప్రముఖ వైద్యుడు, శాంతి క్లినిక్ అధినేత డాక్టర్ జయానంద ప్రకాష్(75) గురువారం ఆయన నివాసంలో మృతి చెందారు. గత నాలుగున్నర దశాబ్దాలుగా ఆయన వైద్యవృత్తిలో కొనసాగారు. పేదల డాక్టర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన భౌతికకాయానికి ఏపీఐఐసీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్ ఆలీబేగ్ తదితరులు ఘనంగా నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.



డాక్టర్ ప్రకాష్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న అన్నా రాంబాబు